
సాక్షి
బాపట్ల
ఆదివారం । 17 । మార్చి । 2024



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 513.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం
ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి కానూరుకు చెందిన కాకర్ల పూర్ణచంద్రరావు పేరిట కాకర్ల శ్రీదేవి శనివారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు ప్రారంభం
విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లో అభివృద్ధి చేసిన రెడ్యూస్– రీసైకిల్– రీయూజ్ ప్రాజెక్టును మేయర్ భాగ్యలక్ష్మితో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)	సహరి (సోమ)
చిలకలూరిపేట	6.27	4.58
గుంటూరు	6.24	4.58
బాపట్ల	6.24	4.56

న్యూస్‌రీల్



పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు

ఎన్నికల నియమావళిని పాటించాల్సిందే

సాక్షి, నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల కమిషన్ విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో శనివారం కలెక్టరేట్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలో ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల కానుందని వివరించారు. జూన్ 4న కౌంటింగ్ జరుగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని చెప్పారు. శనివారం మధ్యాహ్నం జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించానన్నారు. షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలు, చేయకూడని పనులపై ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల ఫొటోలు, విగ్రహాలు కనిపించకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికలు సజావుగా సాగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. సమావేశాలు, ర్యాలీల నిర్వహణకు అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. ప్రచారాలలో రాజకీయ నాయకులు వ్యక్తిగత దూషణలు లేకుండా ప్రచారాలు చేసుకోవాలని కోరారు. మీడియా సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డీఆర్‌ఓ వినాయకం పాల్గొన్నారు.

మార్కెట్ సెస్ వసూలులో టాప్

దాచేపల్లి: మార్కెట్ సెస్ వసూళ్లలో నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డు జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు కార్యదర్శి సూరె శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం యార్డు ద్వారా రూ.6.85 కోట్లు టార్గెట్‌గా ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఇప్పటికే రూ.7 కోట్లకుపైగా మార్కెట్ ఫీజు వసూలు చేశామని వెల్లడించారు. వరసగా రెండో సారి ఫీజు వసూళ్లలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు వెల్లడించారు. యార్డు కార్యదర్శి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు ఎం.సాంబశివరావు, సీహెచ్ వెంగయ్యను యార్డు చైర్‌పర్సన్ కలకండ ఆంథ్రయ్య అభినందించారు.

లోక్‌అదాలత్‌లో 156 కేసులు పరిష్కారం



నరసరావుపేట టౌన్: జాతీయ లోక్ అదాలత్‌లో 156 కేసులు పరిష్కారం కాగా రూ.1.60 కోట్లు కక్షిదారులకు లబ్ధి చేకూరిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, 13వ అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి వై.వి.ఎస్.బి.జి.పార్థసారధి తెలిపారు. 13వ అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. అదాలత్‌లో సివిల్, రాజీ పడదగ్గ క్రిమినల్, చెల్లని చెక్కు, వివాహ సంబంధించిన కేసులు పరిష్కరించారు. అదాలత్‌లో న్యాయమూర్తులు కె.మధుస్వామి, టి.ప్రవల్లిక, సభ్యులు ఎం.చంద్రశేఖర్, ఆనంద్ పాల్గొన్నారు.

32 నామినేషన్లు దాఖలు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : స్థానిక నగరంపాలెంలోని గుంటూరు జిల్లా కోర్టులో ది గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికల సందడి మొదలైంది. ఇప్పటికే వివిధ పదవుల కోసం పోటీల్లో ఉన్న అభ్యర్థులు తమకే ఓటేయాలంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈనెల 28న జరగనున్న ఎన్నికల దృష్ట్యా శుక్రవారం నామినేషన్ల స్వీకరణ చేపట్టిన విషయం విదితమే. ఈ క్రమంలో శనివారం కూడా పలువురు నుంచి నామినేషన్లు స్వీకరించగా ఇప్పటివరకు 32 నామినేషన్లు దాఖలయ్యాయి.

గెలుపు గుర్రాలు సిద్ధం

- వైఎస్సార్ సీపీ అభ్యర్థుల ఖరారు
- నియోజకవర్గాలలో అనుచరుల సంబరాలు



బాపట్ల నియోజకవర్గం కర్లపాలెంలో బాణసంచా కాలుస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులను శనివారం ప్రకటించింది. వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఎన్నికల్లో పోటీచేసే అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులను పార్టీ ప్రకటించింది. దీంతో గత కొంతకాలంగా జరుగుతున్న అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ శనివారంనాటితో ముగిసింది. జిల్లాకు సంబంధించి అసెంబ్లీ అభ్యర్థులతో పాటు పార్లమెంట్ కు పోటీచేసే అభ్యర్థి ఎంపిక ముగియడంతో వారి అనుచరులు, పార్టీ కార్యకర్తలు జిల్లా వ్యాప్తంగా సంబరాలకు దిగారు. స్వీట్లు పంచుకున్నారు. బాణసంచా కాల్చారు. ర్యాలీలు నిర్వహించారు.

అసెంబ్లీకి పోటీచేసే అభ్యర్థుల వీరే...

- బాపట్ల అసెంబ్లీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే కోన రఘుపతిని ప్రకటించారు. గత రెండు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా విజయం సాధించిన కోన రఘుపతి మూడో సారి బాపట్ల నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. కోన రఘుపతిని అభ్యర్థిగా ప్రకటించగానే ఆయన అనుచరులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.
- చీరాల నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా కరణం వెంకటేశ్‌ను ప్రకటించారు. ప్రస్తుతం చీరాల నియోజకవర్గం సమన్వయకర్తగా ఉన్న వెంకటేష్‌ను పార్టీ చీరాల అభ్యర్థిగా నిలిపింది. దీంతో ఆయన అనుచరులు, నియోజకవర్గంలోని నేతలు, కార్యకర్తలు స్వీట్లు పంచుకొని పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. ర్యాలీ నిర్వహించారు.
- అద్దంకి నియోజకవర్గం అభ్యర్థిగా పానెం చిన హనిమిరెడ్డిని ప్రకటించారు. కొంతకాలంగా చిన హనిమిరెడ్డి అద్దంకి సమన్వయకర్తగా ఉన్నారు. పార్టీ చిన హనిమిరెడ్డిని అభ్యర్థిగా ప్రకటించగానే ఆయన అనుచరులు, పార్టీ శ్రేణులు సంబరాలకు దిగాయి.
- పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్న యడం బాలాజీని పార్టీ పర్చూరు అభ్యర్థిగా ఎంపిక చేసింది. దీంతో నియోజకవర్గంలోని ఆయన అనుచరులు, కార్యకర్తలు స్వీట్లు పంచుకున్నారు. ర్యాలీలు నిర్వహించారు.
- రేపల్లె సమన్వయకర్తగా ఉన్న ఈవూరి గణేశ్‌ను పార్టీ రేపల్లె అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో ఆయన అనుచరులు, కార్యకర్తలు నియోజకవర్గంలో సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచి, ర్యాలీ నిర్వహించారు.
- వేమూరు అభ్యర్థిగా పార్టీ అధిష్టానం వరికూటి అశోక్‌బాబును ప్రకటించింది. దీంతో ఆయన అనుచరులు, పార్టీ శ్రేణులు నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచుకొని ర్యాలీ నిర్వహించారు.

పలువురికి తొలిసారి ఎన్నికలు

- బాపట్ల మినహా నాలుగు నియోజకవర్గాల్లో కొత్త అభ్యర్థులు
- అధికార పార్టీనుంచి తొలిసారి పోటీకి దిగుతున్న వైనం

అధికార పార్టీ శనివారం ప్రకటించిన జాబితాలో పలు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు తొలిసారి ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. బాపట్ల నియోజకవర్గం నుంచి కోన రఘుపతి అధికార వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మూడో సారి ఎన్నికల్లో పోటీకి దిగుతుండగా పర్చూరు నుంచి పోటీ చేస్తున్న యడం బాలాజీ, రేపల్లె నియోజకవర్గం నుంచి ఈవూరి గణేశ్, చీరాల నుంచి కరణం వెంకటేష్‌లు రెండో సారి ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. మిగిలిన వారంతా అధికారపార్టీ నుంచి తొలిసారి పోటీ చేస్తుండటం గమనార్హం. వేమూరు రిజర్వుడు నియోజకవర్గం నుంచి వరికూటి అశోక్‌బాబు, అద్దంకి నియోజకవర్గం నుంచి పానెం చిన హనిమిరెడ్డిలు తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగుతున్నారు.

బాపట్ల అభ్యర్థి



నియోజకవర్గం: బాపట్ల
పేరు: కోన రఘుపతి
విద్యార్హత: బీకాం
సామాజిక వర్గం: బ్రాహ్మణ(ఓసీ)
ఎన్నికల్లో పోటీ: మూడోసారి

రాజకీయ నేపథ్యం: తండ్రి కోన ప్రభాకరరావు మూడు సార్లు బాపట్ల ఎమ్మెల్యేగా గెలుపొందారు. స్పీకర్‌గా కూడా పనిచేశారు. రఘుపతి రెండుసార్లు బాపట్ల నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. మూడోసారి బరిలోకి దిగుతున్నారు. కోన చారిటబుల్ ట్రస్టు పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అద్దంకి అభ్యర్థి



నియోజకవర్గం: అద్దంకి
పేరు: పానెం చిన హనిమిరెడ్డి
వయస్సు.: 45
విద్యార్హత: డిప్లమో ఇన్ మైనింగ్
సామాజిక వర్గం: రెడ్డి
ఎన్నికల్లో పోటీ: తొలిసారి

రాజకీయ నేపథ్యం: పల్నాడు జిల్లా క్రోసూరు మండలం దొడ్లేరు స్వగ్రామం. రాజకీయాలపై ఆసక్తితో వైఎస్సార్ సీపీలో చేరారు. 2015లో గుంటూరు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. రెండున్నర సంవత్సరాలు పనిచేశారు. 2023లో సంతనూతలపాడు పరిశీలకునిగా పనిచేశారు.

వేమూరు అభ్యర్థి



నియోజకవర్గం: వేమూరు
పేరు: వరికూటి అశోక్‌బాబు
విద్యార్హత: ఇంజినీరింగ్
సామాజిక వర్గం: ఎస్సీ
ఎన్నికల్లో పోటీ: తొలిసారి

రాజకీయ నేపథ్యం: ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఆయన రోడ్డు రవాణాశాఖలో వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. రాజకీయాలపై ఆసక్తితో వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయనను ప్రకాశం జిల్లా కొండేపి నియోజకవర్గం ఇన్‌చార్జిగా నియమించారు. ప్రస్తుతం వేమూరు నియోజకవర్గం సమన్వయకర్తగా పనిచేస్తున్నారు. వెనుకబడిన సామాజికవర్గాలలో విద్యార్థులను చైతన్యం చేయడం, జీవన విధానంలో మార్పు తీసుకురావడం కోసం కృషి చేశారు. కంటి పరీక్షలు చేయించారు.

రేపల్లె అభ్యర్థి



నియోజకవర్గం: రేపల్లె
పేరు: డాక్టర్ ఈవూరు గణేష్
విద్యార్హత: ఎంబీబీఎస్, పీజీ
సామాజిక వర్గం: గౌడ ఎన్నికల్లో పోటీ: రెండో సారి

రాజకీయ నేపథ్యం: తండ్రి ఈపూరు సుబ్బారావు రెండు పర్యాయాలు, తల్లి సీతారావమ్మ మూడు పర్యాయాలు కూచినపూడి శాసనసభ్యులుగా పనిచేశారు. సీతారావమ్మ మంత్రిగా కూడా పనిచేశారు. గుళ్లపల్లిలో ఈఎస్ఆర్ వైద్యశాల స్థాపించి పేదలకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఫీజులో రాయితీ కల్పించి సేవ చేస్తున్నారు. పలు సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. వైద్యునిగా పేరు గడించారు.

పర్చూరు అభ్యర్థి



నియోజకవర్గం: పర్చూరు
పేరు: యడం బాలాజీ
వయస్సు.: 48
విద్యార్హత: బీటెక్(మెకానికల్)
సామాజిక వర్గం: కాపు
ఎన్నికల్లో పోటీ: రెండోసారి

రాజకీయ నేపథ్యం: బాలాజీ తాత యడం చెన్నయ్య రేపల్లె నియోజకవర్గం నుంచి మూడు పర్యాయాలు శాసనసభ్యునిగా పనిచేశారు. తండ్రి చిన రోశయ్య చీరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు.

చీరాల అభ్యర్థి



నియోజకవర్గం: చీరాల
పేరు: కరణం వెంకటేష్
వయస్సు.: 43
విద్యార్హత: ఎంబీఏ
సామాజిక వర్గం: కమ్మ
ఎన్నికల్లో పోటీ: రెండో సారి

రాజకీయ నేపథ్యం: తండ్రి కరణం బలరామకృష్ణమూర్తి 1978లో రాజకీయ ఆరంగ్రేటం చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1999లో ఒంగోలు పార్లమెంట్ సభ్యుడిగా పనిచేశారు. 2024లో చీరాల నియోజకవర్గ సమన్వయకర్తగా వెంకటేష్ నియమితులయ్యారు.

బాపట్ల ఎంపీ అభ్యర్థి



నియోజకవర్గం: బాపట్ల లోక్‌సభ
పేరు: నందిగం సురేష్
వయస్సు.: 48
విద్యార్హత: 10వ తరగతి
సామాజిక వర్గం: మాదిగ(ఎస్సీ) ,
ఎన్నికల్లో పోటీ: రెండోసారి

రాజకీయ నేపథ్యం: వైఎస్సార్ సీపీలో సామాన్య కార్యకర్త. 2019 ఎన్నికలలో బాపట్ల పార్లమెంట్ స్థానం నుంచి పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారు. ఆ ఎన్నికలలో ఆయన విజయం సాధించారు. తిరిగి మరోసారి పోటీకి సీఎం అవకాశం కల్పించారు.

మోగిన ఎన్నికల నగారా

- నేటి నుంచి కోడ్ అమలు
- 64 లైసెన్స్‌డ్ తుపాకులు స్వాధీనం
- సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా
- 406 మంది రౌడీషీటర్లు బైండోవర్
- మరో 7312 మంది అల్లరిమూకలు బైండోవర్
- జిల్లా వ్యాప్తంగా 27 చెక్‌పోస్టులు ఏర్పాటు
- ఇప్పటికే రూ.2.42 కోట్ల నగదు స్వాధీనం
- జిల్లాకు చేరుకున్న రెండు బీఎస్ఎఫ్ దళాలు



జిల్లాలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న బీఎస్ఎఫ్ దళాలు, పోలీసులు

బాపట్లటౌన్: సార్వత్రిక ఎన్నికలకు నగరా మోగింది. ఎన్నికల కమిషన్ శనివారం షెడ్యూల్ ప్రకటించింది. దీంతో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. జిల్లా అధికార యంత్రాంగం కోడ్ అమలుకు చర్యలు చేపట్టింది. జిల్లాలో మొత్తం 1510 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వాటిల్లో సమస్యాత్మక కేంద్రాలలో ఇప్పటికే వెబ్ కాస్టింగ్, సీసీ కెమెరాలను అమర్చే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. ఎక్కడైనా చిన్న అవాంఛనీయ ఘటన జరిగినా పసిగట్టి చర్యలు తీసుకునేలా రూపకల్పన చేశారు. ఇప్పటికే జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో ఎన్నికల విధులకు అవసరమైన అధికారులను, సిబ్బందిని నియమించారు.

సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా

జిల్లాలోని రెవెన్యూ అధికారులు పోలింగ్ కేంద్రాలు, ఇప్పటికే ఓటర్ల జాబితాలను సిద్ధం చేశారు. రెవెన్యూ అధికారులతోపాటు జిల్లా పోలీస్ యంత్రాంగం ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసింది. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధంగా జిల్లాలో ఎవరైనా ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఓటర్లకు నగదు, మద్యం, ఇతర సామగ్రి పంపిణీ చేసేందుకు ప్రయత్నించినా, వాటిని అక్రమంగా తరలించే ప్రయత్నం చేసినా అలాంటి వారిని అదుపులోకి తీసుకునేందుకు సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలంటూ ఇప్పటికే జిల్లా ఎస్పీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పించే వ్యక్తుల కదలికలపై కన్నేసి ఉంచారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 27 చెక్‌పోస్టులను ఏర్పాటుచేశారు. వాటిల్లో రెండు చెక్‌పోస్టులు జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటుచేశారు. చెక్‌పోస్టుల వద్ద ఎన్నికల కోడ్ ముగిసేందుకు 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండి జిల్లాలోకి ప్రవేశించే, జిల్లా నుంచి బయటకు వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు.

రౌడీషీటర్లపై కదలికలపై కన్నెర్ర

జిల్లాలో ఇప్పటికే రౌడీషీటర్ల కదలిపై ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసులు 406 మందిని బైండోవర్ చేశారు. వాటితోపాటు ఆయా పోలింగ్ బూత్‌ల పరిధిలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే 7312 మందిని గుర్తించి వారిని కూడా ఇప్పటికే బైండోవరు చేశారు. ఇప్పటికే జిల్లాలో 3427 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు



జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఇప్పటికే అన్ని రకాల చర్యలు చేపట్టాం. ఎవరైన అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే అలాటి వ్యక్తులను కఠినంగా శిక్షించడం జరుగుతుంది. జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో ఇప్పటికే చెక్ పోస్టులు సిద్ధం చేశాం. మద్యం, నగదు అక్రమంగా రవాణా చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నాం. ప్రజలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

–వకుల్‌జిందాల్, ఎస్పీ

చీరాల టీడీపీలో నాలుగు స్తంభాలాట

- అందరికీ ఆశపెట్టి పంపుతున్న చంద్రబాబు, లోకేష్‌లు
- రంగంలోకి మళ్లీ రజనీబాబా



చీరాల టీడీపీ సీటు ఆశిస్తున్న చేనేత సామాజిక వర్గానికి చెందిన నాయకులు

చీరాల: చీరాల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి అయోమయంగా తయారైంది. పార్టీ అధిష్టానం ఆశావాహులందరికీ అనేక ఆశలు పెడుతోంది. ఇందులో చంద్రబాబు దగ్గరకు కొందరు వెళ్లి బీసీ కార్డు చూపుతుంటే మరికొందరు మాత్రం సామాజిక సమీకరణాల పేరుతో లోకేష్‌ను ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రతి ఎన్నికల మాదిరిగానే చీరాల్లో టీడీపీ టికెట్ చివరి వరకు దోబూచులాడుతూనే ఉంది. తండ్రీ, కొడుకులు ఆశావాహులకు గంపెడాశలు పెట్టడంతో చీరాల్లో టీడీపీ మూడు వర్గాలు.. ఆరు ముఠాలుగా మారింది. రెండేళ్ల కిందట నుంచి కందుకూరు ప్రాంతానికి చెందిన ఎంఎం కొండయ్యను చీరాల టీడీపీ ఇన్‌చార్జిగా నియమించారు. చీరాల టీడీపీ టికెట్ నీకేనని చంద్రబాబు గట్టిగా హామీ ఇవ్వడంతో అప్పటి నుంచి ఆయనే పార్టీని నడిపిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటికీ కొండయ్యను విజయవాడ, హైదరాబాద్ తిప్పుతున్నారే కానీ టికెట్ ఖరారు చేయలేదు. ఇదిలా ఉంటే చేనేతలకు టికెట్ ఇవ్వాలని ఆ వర్గానికి చెందిన మునగపాటి బాబు, సజ్జా హేమలత, మంగళగిరికి చెందిన తిరువీధుల శ్రీనివాసరావులు పట్టుబడుతున్నారు. చీరాల టికెట్ ఇస్తే చేనేతలకే ఇవ్వాలని శుక్రవారం రజనీబాబాతో కలిసి చంద్రబాబును కలిశారు. అయినప్పటికీ వారికి చంద్రబాబు స్పష్టమైన హామీ ఇవ్వలేదు. సర్వేలు, ఆర్థిక బలాలు, కుల సమీకరణాలను పరిగణలోకి తీసుకుని మళ్లీ కబురు పెడుతామని, టికెట్ ఆశిస్తున్న బీసీ నేతలను తండ్రీ, కొడుకులు వెనక్కి పంపించారు.

తల పట్టుకుంటున్న ఆశావహులు..

అయితే అద్దంకికి చెందిన మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, తనయుడు కృష్ణచైతన్య వైఎస్సార్ సీపీని వీడి చీరాల టీడీపీ కోసం ఆశిస్తున్నారు. ఇందులో భాగంగా చీరాలలోని కొంతమంది ప్రముఖులు మాజీ మంత్రి పాలేటిని వెంటబెట్టుకుని కలుస్తున్నారు. దీంతో చీరాల సీటు ఓసీలకు ఇస్తారా? బీసీలకు ఇస్తారా? బీసీల్లోని చేనేత వర్గానికి ఇస్తారా? అని డోలాయమానంగా ఉంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం డీఎస్పీగా పనిచేస్తున్న ఓ వ్యక్తి చంద్రబాబుకు అనుకూలంగా ఉండే ఓ అధికారి యాదవ సామాజికవర్గానికి సీటు ఇస్తే తనకే కేటాయించాలని చంద్రబాబు వద్ద పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఇప్పటికే వైఎస్సార్ సీపీ 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో టీడీపీ మాత్రం చీరాల నుంచి ఎవరూ పోటీ చేస్తారో అనే సందేహంతో నాయకులు, కార్యకర్తలు మల్లగుల్లాలు పడుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటికీ చీరాల టీడీపీ అభ్యర్థి వ్యవహారంలో చంద్రబాబు మైండ్ గేమ్ ప్రదర్శించడం చీరాల ఆశావాహులకు గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లుగా ఉంది. శనివారం టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో చీరాలకు చెందిన మాజీ మంత్రి పాలేటి రామారావు, మాజీ ఎమ్మెల్యే చెంచుగరటయ్య, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితో కలిసి టీడీపీలో చేరారు.

మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం

- మహిళలకు యడం బాలాజీ భరోసా
- అభ్యర్థిగా ప్రకటించడంతో బాలాజీకి పూలవర్షం



మహిళలకు చేయూత చెక్కు పంపిణీ చేస్తున్న యడం బాలాజీ

పర్చూరు (యద్దనపూడి): అక్కచెల్లెమ్మల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీ అన్నారు. శనివారం స్థానిక ఎస్‌కేపీ ఆర్ డిగ్రీ కళాశాలలో జరిగిన నాలుగో విడత చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళా భ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ తోడు తదితర పథకాలు ప్రవేశపెట్టారని తద్వారా రాష్ట్రం స్వయం ఉపాధిలో దేశంలో ఐదో స్థానానికి చేరిందన్నారు. సంక్షేమ పథకాలు రావాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు వైఎస్సార్ చేయూత పథకాన్ని అమలుచేసి రూ.75 వేలు చొప్పున ప్రతి మహిళలకు అందజేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో 15,499 మంది డ్వాక్రా మహిళలకు రూ.203 కోట్ల రుణమాఫీ అయినట్లు ఆయన వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం పాదుపు మహిళలను అన్ని విధాలా మోసం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. మహిళలు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మహిళలకు నాలుగో విడత చేయూత చెక్కులు అందజేశారు. పర్చూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా యడం బాలాజీ 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా అధిష్టానం యడం బాలాజీ పేరును ప్రకటించారు. ఇదే సమయంలో చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఉన్న ఆయనను అభిమానులు పూలవర్షంతో ముంచెత్తారు. డ్వాక్రా మహిళలు ఆయనను దీవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయనని మీ అందరి చల్లని దీవెనలతో నన్ను గెలిపించాలని కోరారు. పర్చూరు సర్పంచ్ మల్లా అంజమ్మ, ఎంపీపీ మేకా ఆనందకుమారి, వైస్ ఎంపీపీలు పాలేరు వీరయ్య, కోటా ప్రసన్న, కారంచేడు జెడ్పీటీసీ యార్లగడ్డ రజనీ, జిల్లా వైఎస్సార్ సీపీ కార్యదర్శి షేక్ బాబుల్లా, నాయకులు కొల్లా వెంకట్రావు, గాజుల రమేష్, పాలెపోగు రాంబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లోక్ అదాలత్‌లో 113 కేసులు పరిష్కారం

– కె.ఎస్.రామకృష్ణారావు

బాపట్లటౌన్: బాపట్ల సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 113 కేసులు పరిష్కరించినట్లు లోక్ అదాలత్ చైర్మన్, గుంటూరు పోక్సోకోర్టు జడ్జి కె.ఎస్. రామకృష్ణారావు తెలిపారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించడంతోపాటు రూ.56,76,969 సంబంధించిన లావాదేవీలను పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్, బాపట్ల సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహేంద్ర, బార్ అసోసియేషన్ సెక్రటరి ఎల్. సాంబయ్య, లోక్ అదాలత్ సభ్యులు డి.పి.ఫిలిప్, సీహెచ్. రామాంజనేయులు, వై.నరేష్‌బాబు, సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ డి.నరేష్‌కుమార్ వివరాల మేరకు.. వెంగళాయపాలేనికి చెందిన శ్రీరాంశెట్టి ఎర్రయ్య(45)కు భార్య పద్మ, ఇరువురు పిల్లలున్నారు. విజయవాడ కృష్ణలంకకు చెందిన ఎర్రయ్య బావమరిది ఈపూరి వెంకటేశ్వరరావు(32) సాయంత్రం వెంగళాయపాలెంలోని ఎర్రయ్య ఇంటికి వచ్చాడు. కుటుంబ సభ్యులను, బంధువులను కలిశాడు. తిరిగి విజయవాడకు ఆటోలో ఎర్రయ్య, వెంకటేశ్వరరావు బయలుదేరారు. ఈ క్రమంలో ఎన్‌హెచ్ 16లో ఎదురుగా విజయవాడ నుంచి రాయచోటికి వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సును వేగంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జవ్వగా, బస్సు స్వల్పంగా దెబ్బతింది. ఆటోలోని ఎర్రయ్య, వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుల వివరాలు తెలుసుకుని, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. జీజీహెచ్ మార్చురీలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు. ఘటనపై మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులను ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ సోదరుడు రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల సంబరాలు

ప్రత్యేక పూజలు చేసిన అభ్యర్థి కరణం వెంకటేష్

చీరాల: వైఎస్సార్ సీపీ అధిష్టానం శనివారం ఇడుపులపాయలో 2024 ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించింది. దీంతో చీరాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా కరణం వెంకటేష్‌ను ప్రకటించగానే పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. మండలంలోని రామకృష్ణాపురంలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి గడియార స్తంభం సెంటర్ వరకు పార్టీ కార్యకర్తలు, నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం చీరాల్లోని సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చి, పేరాల శివాలయం, చీరాల మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తనను నమ్మి చీరాల నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. ఆయన కొంతకాలం క్రితమే తన వెన్ను తట్టి ప్రోత్సహించారన్నారు. చీరాల్లో ఉన్న బడుగు, బలహీనవర్గాలు, మైనార్టీలు, దళితులు, అన్నీ సామాజిక వర్గాల మద్దతుతో చీరాల్లో మొదటిసారిగా వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి ముఖ్యమంత్రి జగన్‌కు బహుమతిగా అందిస్తానన్నారు. తాను మాత్రమే అభ్యర్థి కాదని ప్రతి నాయకుడు, కార్యకర్త తానే అభ్యర్థిగా భావించి వైఎస్సార్ సీపీ జెండాను చీరాలలో ఎగురవేద్దామన్నారు. చాలామంది కుట్రలు, కుతంత్రాలు పన్ని సీటు అడ్డుకోవాలని చూసినప్పటికీ జగనన్న మాత్రం కరణం కుటుంబాన్ని నమ్మి సీటు ఇచ్చారన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే తన తండ్రి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అనేక అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు పూర్తిచేశారన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే చీరాల నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. గడప గడపలో ఇప్పటికే 80 శాతం గడపలను సందర్శించానని మరో మారు ప్రతి గడపకు, ప్రతీ గ్రామం, ప్రతీ వార్డు, అన్నీ కుటుంబాలను కలిసి చేసిన మంచిని చెప్పి మద్దతు కోరుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్ జైసన్‌బాబు, పట్టణ, రూరల్ అధ్యక్షుడు కొండ్రు బాబ్జి, ఆసాది అంకాళరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, పార్టీ నాయకులు సేవా దళ్ కార్యదర్శి గోలి గంగాధర్, కౌన్సిలర్లు కీర్తి వెంకటరావు, బత్తుల అనీల్, కంపా అరుణ్, మించాల సాంబశివరావు, చీమకుర్తి బాలకృష్ణ, పార్టీ నాయకులు యాతం మేరిబాబు, సునీల్, బి.నరేష్ తదితరులు ఉన్నారు.


గడియార స్తంభం సెంటర్లో కార్యకర్తలతో ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేష్

అద్దంకిలో ర్యాలీ నిర్వహించిన నాయకులు

అద్దంకి: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం వైఎస్సార్ సీపీ తరుపున పోటీ చేయనున్న ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. ఈ జాబితాలో పార్టీ అద్దంకి ఎమ్మెల్యే అభ్యర్థిగా పానెం చిన హనిమిరెడ్డిని ప్రకటించడంతో పార్టీ శ్రేణులు సంబరాలు చేశాయి. ఆయన గత రెండు నెలల క్రితమే పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు సమన్వయకర్తగా పగ్గాలు చేపట్టారు. ప్రభుత్వ కార్యక్రమాలతోపాటు, పల్లెపల్లెకు హనిమిరెడ్డి, పలు సేవా కార్యక్రమాలను చేస్తూ ముందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో పార్టీ అధినేత మేదరమెట్ల వద్ద సిద్ధం సభ నిర్వహించడం, ఆ సభకు నియోజకవర్గం నుంచి స్వచ్ఛందంగా కనీవినీ ఎరుగని రీతిలో నాయకులు కార్యకర్తలు హాజరు కావడంతో పార్టీకి కొత్త ఊపు వచ్చింది. నాయకులు, కార్యకర్తల్లో విజయం మనదేననే ధైర్యం నింపింది. ఎన్నికల్లో విజయం సాధించి హనిమిరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడం ఖాయమని చెప్పున్నారు. అభ్యర్థిగా ప్రకటించడంతో సంబరాలు చేసుకుంటున్నారు. సంతమాగులూరు పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి నాయకులు కార్యకర్తలో ర్యాలీ నిర్వహించారు.


సంతమాగులూరులో ర్యాలీ చేస్తున్న పార్టీ నాయకుడు మహేశ్‌రెడ్డి

కూచిపూడిలో వరికూటికి ఘనస్వాగతం

కూచిపూడి(వేమూరు): వేమూరు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా వరికూటి అశోక్‌బాబు పేరు ఖరారు కావడంతో కూచిపూడి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా పేల్చారు. అనంతరం గ్రామంలో భారీ స్థాయిలో ఊరేగింపు, ర్యాలీ నిర్వహించారు. ఆలయాలలో పూజలు నిర్వహించారు. చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు ప్రకటించడం వల్ల ఆయనకు అభినందనలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండమూడి శ్యామల, గొల్లపూడి లక్ష్మి, పార్టీ మండల అధ్యక్షులు యలవర్తి సురేష్, మాన్యం రాఘవులు, గాలేబు, జాస్తి అంజయ్య, మేకా హరిబాబు, మట్లపూడి బెనహార్, మునిపల్లి సుబ్బయ్య, శొంఠి పాట్టిబ్బాయి తదితరులు పాల్గొన్నారు.


కూచిపూడి గ్రామంలో వరికూటి అశోక్‌బాబు దంపతులు ఊరేగింపు

కోనాకు భావపురి బ్రహ్మరథం

బాపట్లటౌన్: బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతికు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వరుసగా మూడోసారి టికెట్ కేటాయించింది. తమ అభిమాన నేతను అభ్యర్థి ప్రకటించడంతో బాపట్ల నియోజకవర్గంలోని పార్టీ అభిమానులు, కార్యకర్తలు శనివారం సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే కోన రఘుపతి తిరుమల తిరుపతిలో ఉండటంతో సాయంత్రం వరకు బాపట్ల పట్టణంలోని పలు కూడలి ప్రాంతాల్లో పార్టీ అభిమానులు, కార్యకర్తలు బాణసంచా పేల్చి, స్వీట్లు పంచుకున్నారు. శనివారం రాత్రి ఎమ్మెల్యే తిరుపతి నుంచి బాపట్లకు వస్తున్నారన్నా విషయం తెలుసుకున్న నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పట్టణ శివారులోని ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని వై జంక్షన్ వద్దకు చేరుకొని తమ అభిమాన నేతకు అపూర్వ స్వాగతం పలికారు. దారి పొడవున ఆయా గ్రామాల్లోని ప్రజలు రోడ్ల పైకి చేరుకొని ఎమ్మెల్యే కోన రఘుపతికి పూల మాలలు వేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. అభిమానులు చూపించిన ప్రేమాభిమానాలను ఏ మాత్రం తీసిపోని విధంగా ముందుకు నడుస్తానంటూ ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

గ్రానైట్ పరిశ్రమల బంద్ విరమణ


వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీని కలిసిన గ్రానైట్ అసోసియేషన్ సభ్యులు

మార్టూరు: మార్టూరు కేంద్రంగా ఈనెల 10వ తేదీ నుంచి ప్రారంభించిన గ్రానైట్ పరిశ్రమల బంద్‌ను విరమించినట్లు గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీని అసోసియేషన్ సభ్యులతో సురేష్ కలిసి తమ సమస్యలను గురించి వివరించారు. గ్రానైట్ యజమానుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని బాలాజి ఇచ్చిన హామీ మేరకు శనివారం నుంచి బంద్‌ను విరమించినట్లు సురేష్ తెలిపారు.

గురుకుల కళాశాలలో అండర్-20 రెజ్లింగ్ ఎంపికలు



అచ్చంపేట: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన అండర్-20 స్త్రీ, పురుషుల రెజ్లింగ్(కుస్తీ) ఎంపికలు జరిగాయి. ఫ్రీస్టయిల్ పురుషుల విభాగంలో టి.రోహిత్, ఆర్ శ్రీహరి, టి.శ్రీహరి, కె.ప్రభాకర్‌లు ఎంపికయ్యారు. పురుషుల గ్రీకోరోమన్ విభాగంలో కె.రాహుల్, బి.తేజ, ఎస్.బాలకోటేశ్వరరావు, ఎస్ తేజోకుమార్, జెజస్సాకు, ఎ.విజయకుమార్, పి.నవీన్ లో ఎంపికయ్యారు. ఈనెల 20న చిత్తూరులో జరిగే రాష్ట్ర స్థాయిలో పోటీలలో పాల్గొననున్నారు.

సంతమాగులూరులో టీడీపీకి భారీ షాక్

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిన 200 మంది కార్యకర్తలు

సంతమాగులూరు (అద్దంకి): సంతమాగులూరు మండలంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. మండలంలోని వెల్లలచెరువు గ్రామానికి చెందిన 200 టీడీపీ కార్యకర్తలు, ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వారిని ఆ మండల పార్టీ నాయకుడు కైపు మహేశ్‌రెడ్డి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వీరంతా అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పానెం చిన హనిమిరెడ్డిని ప్రకటించడంతో పార్టీలో చేరినట్లు మహేశ్‌రెడ్డి శనివారం తెలిపారు.


వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు

వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీలలో రేపల్లె వాసులకు చోటు

రేపల్లె రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించిన కమిటీలలో రేపల్లె నియోజవకర్గంకు చెందిన పలువురికి స్థానం లభించింది. బాపట్ల జిల్లా మైనార్టీ విభాగం కమిటీలో రేపల్లెకు చెందిన పలువురికి పదవులు దక్కాయి. బాపట్ల జిల్లా మైనార్టీ విభాగం వైస్‌ప్రెసిడెంట్‌గా షేక్ అలీబుడా, జనరల్ సెక్రటరీగా షేక్ అన్వర్, జాయింట్ సెక్రటరీగా అబ్దుల్ మైమూద్, కార్యదర్శులుగా షేక్ మునీర్, షరీఫ్‌బేగ్‌లు నియమితులయ్యారు.

జిల్లా యువజనవిభాగం

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ బాపట్ల జిల్లా యువజన విభాగంలో రేపల్లె నియోజకవర్గానికి చెందిన పలువురు ఎంపికయ్యారు. వైస్‌ప్రెసిడెంట్‌గా నల్లగుర్ల దేవీప్రసాద్, జనరల్‌సెక్రటరీగా కొలగాని శ్రీనివాసరావు, సెక్రటరీలుగా దొంతిబోయిన ఏడుకొండలు రెడ్డి, కొక్కిలిగడ్డ ప్రశాంత్, జాయింట్ సెక్రటరీలుగా శీలం పూర్ణచంద్రశేఖరరెడ్డి, తూనుగుంట్ల సుమన్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా డి.నాగమల్లేశ్వరరావు, పూర్ణ శివనాగ దుర్గావెంకటేశ్వరరావులు నియమితులయ్యారు.

యువజన విభాగం మండలాల అధ్యక్షుల నియామకం

వైఎస్సార్ సీపీ యువజన విభాగం రేపల్లె పట్టణ అధ్యక్షుడుగా ఆలా రాజ్‌పాల్, రేపల్లె మండల అధ్యక్షుడుగా యంద్రపాటి సుధీర్, నిజాంపట్నం మండల అధ్యక్షుడుగా మోపిదేవి సాయికిరణ్‌లు ఎన్నికయ్యారు.